


వైభవంగా కల్యాణోత్సవం

నగరంపాలెం: బ్రాడీపేటలోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరి పీఠ పాలిత ఓంకార క్షేత్రంలో బుధవారం శ్రీ రుక్మిణీ సమేత శ్రీకృష్ణ కల్యాణం వైభవంగా జరిగింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 548.50 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 10,120 క్యూసెక్కులు విడుదలవుతోంది.

రేషన్ బియ్యం స్వాధీనం



కొల్లిపర: మండల పరిధిలోని దంతలూరు గ్రామంలో మరియమ్మ అనే మహిళ ఇంటి వెనుక గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 9 క్వింటాల 61 కేజీల రేషన్ బియ్యం ఉంచడంతో స్వాధీనం చేసుకున్నట్లు బుధవారం తహసీల్దారు జి.సిద్ధార్థ తెలిపారు.

న్యూస్‌రీల్

మద్యం షాపుల దరఖాస్తు గడువు పొడిగింపు

నరసరావుపేటటౌన్: రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు గీత కులాలకు కేటాయించిన మద్యం షాపులకు దరఖాస్తుల స్వీకరణ గడువు ఈ నెల 5వ తేదీ నుంచి 8వ తేదీకి పొడిగించినట్లు పల్నాడు జిల్లా ఎక్సైజ్ ఈఎస్ మణికంఠ బుధవారం తెలిపారు. స్వీకరించిన దరఖాస్తులను 10వ తేదీ ఉదయం 9 గంటలకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ తీయడం జరుగుతుందని పేర్కొన్నారు.

లక్ష్మీనృసింహస్వామికి వెండి పళ్లెం కానుక



మంగళగిరి: నగరంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారికి దాతలు వెండి పళ్లెం కానుకగా సమర్పించారు. బుధవారం ఆలయ ఆవరణలో ఈవో కార్యాలయంలో ఆద్య బిల్డర్స్ అధినేత చిరుమామిళ్ళ చంద్రశేఖర్ రూ.1.40 లక్షల విలువైన 1 కేజీ 35 గ్రాముల వెండి, 2 గ్రాముల బంగారంతో కూడిన పళ్లెంను ఈఓ ఎ. రామకోటిరెడ్డికి అందజేశారు. దాతలను ఈఓ అభినందించారు. స్వామి వారి వస్త్రాలతో సత్కరించారు.

ప్రశాంతంగా ఒకేషనల్ ప్రాక్టికల్స్

నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియెట్ ఒకేషనల్ విద్యార్థుల ప్రాక్టికల్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా ఉదయం 11 కేంద్రాలలో నిర్వహించిన ప్రాక్టికల్స్‌కు 711 మంది విద్యార్థులకు గాను 617 మంది హాజరయ్యారు. మరో 94మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం 10 కేంద్రాలలో నిర్వహించిన పరీక్షకు 546 మంది విద్యార్థులకు గాను 502మంది హాజరు కాగా మరో 44మంది గైర్హాజరయ్యారు. పరీక్షలను జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారిణి ఎం.నీలావతిదేవి, స్పెషల్ ఆఫీసర్ కె.వేణు పర్యవేక్షించారు.

పెరుమాళ్లకు సామూహిక కల్యాణ మహోత్సవం



తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై అన్ని ఆలయాల పెరుమాళ్లకు బుధవారం సామూహిక కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ చిన్న జీయర్ స్వామి సమక్షంలో 8వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ వేడుక నిర్వహించామని చెప్పారు. సాయంత్రం 5 గంటలకు శ్రీ స్వామి వారిని గరుడ వాహనంపై శ్రీనివాసుని గిరి పరిక్రమణ గావించామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వేదవిద్యార్థులు, భక్తులు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

హీరో మహేష్‌బాబు ఓటు తొలగింపు



గుంటూరు ఎడ్యుకేషన్ : శాసనమండలి కృష్ణా–గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితాలో ప్రముఖ సినీ నటుడు ఘట్టమనేని మహేష్‌బాబు పేరుతో నమోదైన ఓటును తొలగించినట్లు గుంటూరు నగరపాలకసంస్థ అదనపు కమిషనర్, ఏఈఆర్వో చల్లా ఓబులేసు గురువారం తెలిపారు. గుంటూరులో హీరో మహేష్‌బాబుకు ఓటు శీర్షికతో బుధవారం 'సాక్షి' మెయిన్ ఎడిషన్‌లో ప్రచురితమైన కథనానికి ఏఈఆర్వో స్పందించారు. మహేష్‌బాబు పేరుతో ఓటు తప్పుగా నమోదైందని, దీనిపై దాఖలు చేసిన ఫారం–7 విచారణ అనంతరం సంబంధిత ఓటును తొలగించామని వివరించారు. గుంటూరు అర్బన్‌లో ఓటు కోరుతూ వచ్చిన దరఖాస్తులపై బూత్ లెవల్ అధికారులతో విచారణ చేయించామన్నారు. అర్హులైన వారి దరఖాస్తులను ఆమోదించినట్లు పేర్కొన్నారు.

సాక్షి ఎఫెక్ట్

కొండ పోరు కృష్ణ..కృష్ణా!

బాపట్ల ఎంపీ, చీరాల ఎమ్మెల్యే మధ్య విభేదాలు

- బాపట్ల ఎమ్మెల్యే వర్మతో గొడవలు
- ఎంపీని వ్యతిరేకిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు
- అధికారుల బదిలీలు, ఇసుక అక్రమ వ్యాపారంలో ఎమ్మెల్యేలు, మంత్రులదే హవా
- మద్యంషాపుల టెండర్లు, బెల్టు షాపుల ఏర్పాటులోనూ ఇదే తీరు
- ఎంపీగా తన పెత్తనం సాగాల్సిందేనంటున్న కృష్ణప్రసాద్



సాక్షి ప్రతినిధి,బాపట్ల: బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, చీరాల ఎమ్మెల్యే ఎంఎం. కొండయ్యల మధ్య వర్గపోరు రోడ్డున పడింది. చీరాలలో పచ్చపార్టీ నేతల మధ్య ఎంపీ చిచ్చుపెడుతున్నారని ఎమ్మెల్యే అనుచరులు మంగళవారం ఏకంగా ఎంపీ కృష్ణప్రసాద్‌పై బహిరంగ విమర్శలు చేయడం ఇప్పుడు టీడీపీ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ఇటీవల ఇసుక అక్రమరవాణా వ్యవహారంలో అటు ఎంపీ వర్గం ఇటు ఎమ్మెల్యే వర్గం ఢీ అంటే ఢీ అనుకొని గొడవలకు దిగింది. ఎమ్మెల్యే అనుచరులు ఎంపీ అనుచరుడి ఇసుక క్వారీలో ఉన్న జేసీబీని తగులబెట్టడంతో ఎంపీ వర్గీయులు ఎమ్మెల్యే అనుచరులపై కేసులు పెట్టారు. దీంతో చీరాల్లో పచ్చనేతల ఇసుక వ్యాపారం గొడవ రాష్ట్రస్థాయికి చేరింది. అంతకు ముందు అధికారుల బదిలీల కోసం ఎంపీ సిఫార్సు లేఖలు ఇవ్వగా ఎమ్మెల్యే కొండయ్య తీవ్రంగా వ్యతిరేకించారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎంపీ పెత్తనమేంటని నిలదీశారు. ఎంపీ సిఫార్సు చెల్లదని గొడవ చేశారు. చీరాల నుంచి ఇతర ప్రాంతాలకు ఇసుక తరలింపు, అక్రమ రిసార్టుల నుంచి ఎమ్మెల్యే నెలమామూళ్లతో రూ.కోట్లు కొల్లగొడుతున్నారనే ఆరోపణలు వచ్చాయి. వీటిపై ఎంపీ టీడీపీ అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు పార్టీలో ప్రచారం జరిగింది.

బాపట్ల ఎమ్మెల్యేతో సైతం..

మరోవైపు బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, ఎంపీ కృష్ణప్రసాద్‌కు మధ్య విబేధాలు ముదిరాయి. కొందరు జిల్లా, మండల స్థాయి అధికారుల బదిలీలకోసం ఎంపీ కృష్ణప్రసాద్ జిల్లా అధికారులకు సిఫార్సు లేఖలు ఇవ్వగా ఎమ్మెల్యే ఆదేశాలతో బుట్టదాఖలు చేశారు. ఎంపీ సిఫార్సులు ఏఒక్కటి పరిగణలోకి తీసుకోకూడదని జిల్లా అధికారులను ఆదేశించారు. మద్యం షాపుల టెండర్లు, బెల్టు షాపుల ఏర్పాటులోనూ ఎంపీ, ఎమ్మెల్యే వర్గాలు ఢీ అంటే ఢీ అనే స్థాయిలో గొడవలకు సిద్ధమయ్యాయి. జిల్లాలో తీరప్రాంతాన్ని కలుషితం చేస్తున్న హేచరీస్, ప్రాసెసింగ్ యూనిట్లను తొలగించాలని ఎంపీ వర్గీయులు కొందరు ఫిర్యాదులు చేసినట్లు ప్రచారంవుంది. వీటిలో చాలాభాగం బాపట్ల ఎమ్మెల్యేతో పాటు పచ్చపార్టీకి చెందిన కొందరి నేతలవి కావడం గమనార్హం. జిల్లాకు చెందిన మంత్రులు మిగిలిన ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాలతోపాటు బయట ప్రాంతాల్లోనూ ఇసుక, బుసక, గ్రావెల్, గ్రానైట్ మొదలైన వనరులను కొల్లగొట్టి రూ.కోట్లు దండుకుంటుంటే ఎంపీగా ఎన్నిక కావడానికి రూ. పదుల కోట్లు వెచ్చించినా పైసా రాబడి లేదని, ఏ నియోకవర్గానికి వెళ్లినా ఎమ్మెల్యేలు మా అడ్డా అంటుంటే తామెక్కడ పోవాలని ఎంపీ వర్గం వాపోతోంది.

ఆదినుంచి వ్యతిరేకతే..

ఎంపీ కృష్ణప్రసాద్‌ను తెలంగాణ నుంచి దిగుమతి చేసుకొని బాపట్ల ఎంపీ అభ్యర్థిగా నిలపడాన్ని అప్పట్లో జిల్లాలోని ఎమ్మెల్యే అభ్యర్థులందరూ వ్యతిరేకించారు. ఎన్నికల ప్రచారంలోనూ ఆయనను కలుపుకొని పోలేదు. ప్రచారానికి వస్తామన్నా అప్పట్లో వర్మ, ఎంఎం. కొండయ్య, పర్చూరు, అద్దంకి అభ్యర్థులు సైతం దూరంపెట్టారు. దీంతో చంద్రబాబు తోపాటు పవన్‌కళ్యాణ్ పాల్గొన్న సమావేశాలకే కృష్ణప్రసాద్ పరిమితమయ్యారు. ఆయన కుటుంబ సభ్యులు బాపట్లలో మకాంవేసి సొంతంగా ప్రచారం నిర్వహించారు. అప్పటినుంచి ఇప్పటి వరకూ అదే వివక్ష కొనసాగుతోందని ఎంపీ వర్గం ఆరోపిస్తోంది. టీడీపీ అధికారం రావడంతో మంత్రులు, ఎమ్మెల్యే దోపిడీకి తెరలేపారని, ఎవరికి వారు నియోజకవర్గంలో ఉన్న వనరులను కొల్లగొట్టే ప్రయత్నంలో బిజీగా ఉన్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ పరిస్థితిలో బాపట్ల ఎంపీనంటూ కృష్ణప్రసాద్ దూరడాన్ని ఎమ్మెల్యేలు సహించలేకున్నారు. దీంతో ఎంపీతో పాటు ఆయన వర్గం ఆగ్రహంతో ఎమ్మెల్యేల అక్రమాలను ఎప్పటికప్పుడు అధిష్టానానికి చేరవేస్తున్నట్లు తెలుస్తోంది.

వైఎస్సార్ సీపీ బీసీ నేత

ఇంటిపై దౌర్జన్యం

టీడీపీ నేతల ప్రోద్బలంతో ఇంటి పక్కన నిర్మాణాలు కూల్చివేత

మార్టూరు: మురుగు నీటి పారుదలకు అడ్డుగా ఉందంటూ వైఎస్సార్ సీపీ నాయకుడి ఇంటి ముందు, పక్క నిర్మాణాలను అధికారులు పొక్లెయిన్‌తో ధ్వంసం చేయించారు. ఈ ఘటన మార్టూరు మండలంలోని కోలలపూడి గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామంలోని బీసీ యాదవ వర్గానికి చెందిన వేల్పుల ఆంజనేయులు గత రెండు సంవత్సరాలుగా తన ఇంటి ముందుభాగంలో వాటర్ ప్లాంట్ నిర్మించి గ్రామస్తులకు ఉచితంగా తాగునీరు సరఫరా చేస్తున్నాడు. అయితే ఇది అతని ఇంటి చుట్టుపక్కల నివసించే టీడీపీకి చెందిన మరో సామాజికవర్గం వారికి నచ్చలేదు. ఆంజనేయులు వైఎస్సార్ సీపీకి చెందిన వ్యక్తి కావడంతో.. కూటమి ప్రభుత్వం రాగానే వారు రెచ్చిపోయారు. ఆంజనేయులు ఇంటి ముందు, పక్క భాగాలు మురుగునీటి పారుదలకు అడ్డుగా ఉందని ఫిర్యాదు చేశారు. ఆ నిర్మాణాలను తొలగించాలంటూ జనవరి చివరివారంలో ఆంజనేయులుకు పంచాయతీ కార్యదర్శి సుధాకర్ నోటీసులు పంపించారు. ఈ క్రమంలో పంచాయతీ కార్యదర్శి సిబ్బంది, పోలీసులతో ఆంజనేయులు ఇంటికి చేరుకున్నాడు. తన ఇంటి ముందున్న నిర్మాణాల వలన మురుగునీటి పారుదల సక్రమంగానే ఉందని, నీరు ఎక్కడా నిలబడటం లేదని..అందుకే తాను తొలగించనని ఆంజనేయులు స్పష్టం చేశాడు. అదే వీధిలోని చాలా మంది నివాసాలు సీసీ రోడ్డును సగం వరకు ఆక్రమించాయని, వాటిని ఎందుకు తొలగించరని ప్రశ్నించాడు. ఆ వీధిలోని వారు ఆక్రమణలకు పాల్పడిన మాట నిజమేనని వారిపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని, దీనిపై ఫిర్యాదు వచ్చింది కాబట్టి తామే స్వయంగా డ్రైనేజీ కాలువను ధ్వంసం చేస్తామని పంచాయతీ అధికారి చెప్పడం గమనార్హం. ఈ క్రమంలో కార్యదర్శి సుధాకర్‌తో పాటు వీఆర్‌ఓ వీరయ్య, సర్పంచ్ సతీష్ కుమార్‌లు పొక్లెయిన్‌తో పోలీసుల సమక్షంలో నిర్మాణాలు తొలగించారు.



పొక్లెయిన్‌తో ఆంజనేయులు ఇంటి ముందు భాగాన్ని తొలగిస్తున్న దృశ్యం

అక్రమ నిర్మాణాలన్నీ తొలగించాలి



నాపై కక్ష సాధింపులో భాగంగానే అధికారులు నా ఇంటి ముందు నిర్మాణాలను ధ్వంసం చేశారు. మురుగు నీటి పారుదలకు ఎలాంటి అవరోధం లేకపోయినా కావాలని చేశారు. వీధిలో ఉన్న అక్రమ నిర్మాణాలపై అధికారులకు ఫిర్యాదు చేస్తా. వాటిని తొలగించి అధికారులు వారి చిత్తశుద్ధి నిరూపించుకోవాలి.

– వేల్పుల ఆంజనేయులు, బాధితుడు

ఫిర్యాదు చేస్తే తొలగిస్తాం

మురుగు నీటి పారుదలకు అవరోధంగా ఉందని స్థానికులు ఫిర్యాదు చేస్తే ఆంజనేయులు ఇంటి ముందు, పక్క భాగాలను తొలగిస్తున్నాం. ఇందులో రాజకీయం ఏమీ లేదు. వీధిలో అక్రమ నిర్మాణాలు ఉన్న మాట నిజమే. ఫిర్యాదు చేస్తే తొలగిస్తాం.

– సుధాకర్, పంచాయతీ కార్యదర్శి

నిబంధనలే సరైన 'మార్గం'

జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: అవగాహనతోనే రహదారి ప్రమాదాల నివారణ సాధ్యమని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బాపట్ల పట్టణంలో బుధవారం అవగాహన ర్యాలీ జరిగింది. జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. మున్సిపల్ ఉన్నత పాఠశాల నుంచి పాత బస్టాండ్ కూడలి వరకు సాగిన ర్యాలీలో జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, ఎస్పీ తుషార్ డూడీ పాల్గొన్నారు. పోలీసులు, డ్రైవర్లు ప్లకార్డులు చేతబూని నినదించారు. రవాణా శాఖ సిబ్బంది, పోలీసులు, డ్రైవర్లు కలసి మానవహారం నిర్వహించారు. అనంతరం డ్రైవర్లతో జిల్లా కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ జె.వెంకట మురళి చెప్పారు. ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ తప్పక ధరించాలని, కారు ప్రయాణమైతే సీటు బెల్టు తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ రహదారులపై అధికంగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించి ప్రత్యేక శ్రద్ధ పెట్టామన్నారు. రోడ్డు ప్రమాదాలతో చాలా కుటుంబాలు నష్టపోతున్నాయనే విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. బాధిత కుటుంబాలకు జరిగే నష్టాన్ని ఎవరూ పూడ్చలేరన్నారు. జిల్లా అదనపు ఎస్పీ విఠలేశ్వర్, రవాణా శాఖ అధికారి పరంధామరెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయమ్మ, బాపట్ల ఆర్డీఓ పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, ఎంపీఐలు, పోలీస్ అధికారులు, డ్రైవర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



రహదారి భద్రతా మాసోత్సవాల ప్రదర్శనలో జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, ఎస్పీ



మానవహారం చేపట్టిన విద్యార్థులు

నులి పురుగుల దినోత్సవం విజయవంతం చేయండి

బాపట్ల: జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ఈనెల 10వ తేదీన 0–18సంవత్సరాల వయస్సు కలిగిన ప్రతి ఒక్కరితో ఆల్బెండజోల్ మందులు మింగించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో వైద్యశాఖ అధికారులతో సమీక్షించారు. ఈనెల 10వ తేదీన పాఠశాలలకు పిల్లలను తప్పనిసరిగా పంపేవిధంగా చూడాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి కోరారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయమ్మ, డీఆర్‌ఓ జి.గంగాధర్ గౌడ్, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై దృష్టి పెట్టండి

బాపట్ల: ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి నోడల్ ఆఫీసర్లను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలోని సమావేశం హాల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో మార్చి 8వ తేదీవరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని ఆయన తెలియజేశారు. 12 మండలాలలో 28 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు 24,440 మంది గ్రాడ్యుయేట్స్ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని ఆయన చెప్పారు. వీరిలో పురుషులు 15,292 మంది, మహిళలు 9,150 మంది థర్డ్ జెండర్ ఐదుగురు ఉన్నారని ఆయన తెలియ జేశారు. పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఇబ్బందులు లేకుండా మౌలిక సౌకర్యాలు కల్పించాలని రెవెన్యూ డివిజనల్ అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ జి.గంగాధర్ గౌడ్, ఏఎస్పీ విఠలేశ్వర్, డీఆర్‌డీఏ పీడీ పద్మజ, డ్వామా పీడీ విజయలక్ష్మీ, డీపీఓ ప్రభాకర్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా, డీఏఓ రామకృష్ణ, హౌసింగ్ పీడీ వై. వెంకటేశ్వరరావు, రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'తపాలా' మోత మోగింది

పోస్టల్ చార్జీలు భారీగా పెంచిన కేంద్రం

- రిజిస్టర్ బుక్ పోస్ట్ సౌకర్యం తొలగింపు
- ఇకపై బుక్ పోస్ట్ మాత్రమే..
- మూడు రకాల సేవలను ఒకే విభాగం కిందకు తెస్తూ ఉత్తర్వులు
- వార, పక్ష, మాస పత్రికల, పుస్తకాల బట్వాడాపై తీవ్ర ప్రభావం
- దిగుమతి సుంకంపై ఆందోళన



నరసరావుపేటలోని ప్రధాన తపాలా కార్యాలయం

సత్తెనపల్లి: బుక్ పోస్ట్ సర్వీసుల రుసుం పెంపు పుస్తక ప్రియుల పాలిట శరాఘాతమైంది. ఈ సర్వీసుపై మోదీ సర్కార్ ధరల మోత మోగించింది. ఉత్తరాలు, మనియార్డర్ల బట్వాడా నుంచి బ్యాంకింగ్ సేవల వరకు దశల వారీగా విస్తరిస్తూ వచ్చిన తపాలా శాఖ బుక్‌పోస్ట్ పై భారీగా షాక్ ఇచ్చింది. దీంతో వార, పక్ష, ఆధ్యాత్మిక, ఇతర పుస్తకాల బట్వాడా పై ధరల మంట మండింది.

బుక్ పోస్ట్ సర్వీస్ పేరుతో...

బుక్‌పోస్ట్ సర్వీస్ పేరుతో ఇంతకాలం అతి తక్కువ ధరకే కోరుకున్న పుస్తకాన్ని పాఠకుడికి అందజేసేవారు. తాజాగా మూడు రకాల బుక్ పోస్ట్ సేవలను ఒకే విభాగం కిందకు తెస్తూ రిజిస్టర్ ప్రింటెడ్ బుక్ పోస్టును 'బుక్‌పోస్ట్' గా మార్చి సేవల ఛార్జీ పెంచారు. ఈ క్రమంలోనే నాలుగు రకాలుగా ఉన్న పోస్ట్ కార్డులను ఒకే విభాగం కిందకు తెచ్చారు. రిజిస్టర్ బుక్ పోస్ట్ కాలమ్‌ను గత ఏడాది డిసెంబర్ 18 నుంచి ఏకంగా సాఫ్ట్‌వేర్ నుంచి తొలగించడం తపాలా ఉద్యోగులతో పాటు అందరినీ షాక్‌కు గురి చేసింది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం పుస్తకాలతో పాటు దిన, వార, పక్ష పత్రికల బట్వాడా పై తీవ్ర ప్రభావం చూపనుంది.

పుస్తక ధరలు పెరిగే అవకాశం

తపాలా శాఖ కఠిన నిర్ణయాలతో ప్రైవేట్ కొరియర్ సేవలే మేలనే పరిస్థితి వచ్చిందని వినియోగదారులు అంటున్నారు. తాము ఫోన్ చేస్తే చాలు పబ్లిషర్లు ఇంటికే పుస్తకాలు పంపుతున్నారని గుర్తు చేసుకుంటున్నారు. దేశంలో ఏ మారుమూల ప్రాంతం నుంచి అయినా పుస్తకాలు వార, పక్ష పత్రికలు తెప్పించుకోవాలంటే ఐదు కిలోల బరువు ఉన్న పార్సిల్‌కు గతంలో రూ. 80 చెల్లించేవారని, ఇప్పుడు అదేబరువు కలిగిన పార్సిల్‌కు రూ.365 చెల్లించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిజిస్టర్ బుక్ పోస్ట్ ద్వారా 200 పేజీలు పుస్తకాన్ని జీఎస్టీ తో కలిపి రూ. 25 కు పంపించేవారు. ఇప్పుడు ఆ సర్వీసును తపాలా శాఖ రద్దు చేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పుస్తకాన్ని రిజిస్టర్ పార్సిల్‌లో మాత్రమే అందుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రూ. 100 విలువ చేసే పుస్తకాన్ని పాఠకుడెవరైనా.. పోస్టల్‌లో తెప్పించుకోవాలంటే రూ. 80 పోస్టల్ చార్జీల కింద భరించాల్సి ఉంటుంది. దీంతో పుస్తకాల ధరలకు రెక్కలు వచ్చే అవకాశం ఉంది.

దిగుమతిపై 'పన్ను' పోటు

శాంపిల్ పుస్తకాలపై ఐదుశాతం దిగుమతి సుంకం విధించడం మరింత ఆందోళనకు గురిచేస్తుంది. ప్రాంతీయ భాషలో ముద్రించిన పుస్తకాలను విదేశీ భాషల్లోకి అనువాదం చేసి ప్రచురిస్తుంటారు. ఇలాంటి సందర్భాల్లో విదేశీ పబ్లిషర్లు ఆ పుస్తకాల కాంప్లిమెంటరీ కాపీలను పంపుతుంటారు. ఇలా విదేశాల నుంచి వచ్చే పుస్తకాలపై తొలిసారి కేంద్రం దిగుమతి సుంకం విధించింది. వాణిజ్య పరంగా విక్రయించేందుకు ఉద్దేశించిన పుస్తకాలపై దిగుమతి విధించడం సమర్థనీయమే అయినా కాంప్లిమెంటరీగా పంపే పుస్తకాలపై అదనపు భారం మోపడం దుర్మార్గమేనన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

మిర్చి రికార్డు

యార్డులో 1,27,321 బస్తాలు విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం భారీ స్థాయిలో ఈ సీజన్‌లోనే తొలిసారి అత్యధికంగా 1,21,569 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,27,321 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,000 నుంచి రూ.15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.15,500 వరకు ధర లభించింది. ఏసీ కామన్ రకం రూ.9,500 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.11,000 నుంచి రూ.14,700 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.10,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 72,162 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

క్లుప్తంగా

వ్యాయామోపాధ్యాయుడు తుమ్మాకు జాతీయస్థాయి కాంస్య పతకాలు



చెరుకుపల్లి: ఓ పక్క తన విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతూనే మరోవైపు తానూ జాతీయస్థాయిలో రాణిస్తున్నారు వ్యాయామ ఉపాధ్యాయుడు తుమ్మా శ్రీనివాసరెడ్డి. చెరుకుపల్లి మండలం పొన్నపల్లి గ్రామానికి చెందిన ఆయన భట్టిప్రోలు మండలం ఐలవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. గత ఏడాది డిసెంబర్ 28, 29 తేదీలలో గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్ 60 సంవత్సరాల విభాగంలో లాంగ్‌జంప్, పోల్‌వాల్ట్‌లో తన ప్రతిభ కనపరిచి గోల్డ్ మెడల్స్ సాధించి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. అనంతరం కేరళ రాష్ట్రం త్రిస్సూల్ జిల్లా కున్నాంకులం స్టేడియంలో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 4 వరకు జరిగిన జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొని లాంగ్ జంప్‌లో 4.22 మీటర్లలో కాంస్య పతకం, పోల్‌వాల్ట్ లో1.80 మీటర్లలో కాంస్య పతకం సాధించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం



చినగంజాం: మద్యం బాటిళ్లు కలిగి ఉన్న ఓ మహిళను ఎక్సైజ్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. చీరాల ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు అందించిన సమాచారం ప్రకారం బాపట్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఆదేశాల మేరకు చీరాల ఎక్సైజ్ ఎస్ఐ శ్రీహరి తన సిబ్బందితో కలిసి సంతరావూరులోని నాగార్పమ్మ గుడి వద్ద తనిఖీలు చేశారు. మద్యం బాటిళ్లు కలిగి ఉన్న మీసాల కోమలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 16 బ్రాందీ సీసాలు స్వాధీనం చేసుకున్నారు.

చెట్టును ఢీకొట్టిన కారు

ఇద్దరికి తీవ్ర గాయాలు

మద్దిపాడు: జాతీయ రహదారిపై వెళ్తున్న కారు అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం మధ్యాహ్నం మద్దిపాడు మండలం వెంకటరాజుపాలెం సమీపంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన బి.కొండలరావు, బాలాజీ తమ వ్యక్తిగత పనిపై కారులో గూడూరు వెళ్లారు. అక్కడ పని ముగించుకుని తిరిగి విజయవాడకు బయలుదేరారు. మార్గమధ్యంలో వెంకటరాజుపాలెం సమీపంలో వీరి కారు అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. కారు ముందు సీట్లో కూర్చున్న బాలాజీకి నుదుటిపై, కొండలరావుకు తలపై తీవ్ర గాయాలయ్యాయి. వారి వెనుక వస్తున్న వర్కర్లు ప్రమాదాన్ని గమనించి క్షతగాత్రులిద్దరినీ మద్దిపాడు పీహెచ్‌సీకి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు జీజీహెచ్‌కు సిఫార్సు చేశారు.

విద్యార్థుల జీవితాలతో ఆటలాడతారా?

- సకాలంలో ఫీజ్ రీయింబర్స్‌మెంట్ ఎందుకు ఇవ్వరు?
- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు పీఆర్కే



మాట్లాడుతున్న పీఆర్కే

రెంటచింతల: ఫీజ్ రీయంబర్స్‌మెంట్‌ను సకాలంలో విడుదల చేయకుండా చంద్రబాబు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటోందని జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆరోపించారు. బుధవారం రెంటచింతలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎన్నికల సంఘం విడుదల చేయడం వలన ఈ నెల 5న తలపెట్టిన ఫీజుపోరును ఈ నెల 12కు వాయిదా వేయడం జరిగిందన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలోని ఆనాటి ప్రభుత్వం విడతల వారీగా సరైన సమయంలో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అందచేశారన్నారు. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా అభివృద్ధి చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఎనలేని కృషి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యార్థులకు వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని కోరుతూ వారికి అండగా ఉండేందుకు వైఎస్సార్ సీపీ మార్చి 12న ఫీజ్‌పోరును తలపెట్టినట్లు తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వైఎస్సార్ సీపీ తలపెట్టిన ఈ ఫీజ్‌పోరులో పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా మరోసారి మోసం చేస్తున్నాడని ఆరోపించారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి, మాజీ జడ్పీటీసీ నవులూరి భాస్కర్‌రెడ్డి, పార్టీ నాయకులు ఏరువ ప్రతాప్ రెడ్డి, వెన్నా వెంకటేశ్వరరెడ్డి, పేర్ల ముత్తయ్య, గొట్టం భాస్కర్‌రెడ్డి, పాతపాటి పిచ్చిరెడ్డి, గుండా కిశోర్, లక్ష్మారెడ్డి తదితరులున్నారు.

రైతులకిచ్చినవి అటవీ భూములు కావు

- జాయింట్ యాక్షన్ కమిటీ సర్వేలో స్పష్టం
- హద్దులు నిర్ణయించిన అటవీ, రెవెన్యూ అధికారులు
- రైతులకు ఊరట



చెరుకుంపాలెంలో పరిశీలన చేస్తున్న అధికారులు

అచ్చంపేట: మండలంలోని తాళ్లచెరువు రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.320 నుంచి 337 వరకు ఉన్న భూములపై అటవీ, రెవెన్యూ శాఖల మధ్య ఉన్న వివాదానికి తెరపడింది. అటవీ, రెవెన్యూ శాఖాధికారులు మంగళవారం సాయంత్రం జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేసి రెవెన్యూ భూముల వరకు హద్దులు నిర్ణయించారు. దీంతో మూడునెలల భూ వివాదానికి తెరపడింది. స.నెం 320–337 మధ్య 100 ఎకరాలకు పైగా భూమి ఉండగా 1993లో తాళ్లచెరువు, చెరుకుంపాలెం గ్రామాలకు చెందిన సుమారు 100 మంది నిరుపేదలకు అప్పటి రెవెన్యూ అధికారులు డీకే పట్టాలు పంపిణీ చేశారు. వారిలో సుమారు 60 మంది వరకు భూములను అభివృద్ధి చేసుకుని సాగుచేసుకుంటున్నారు. మరో 40 మంది భూములు అలానే ఉన్నాయి. ఉన్న భూమిలోనే కంది వంటి అపరాల పంటలు వేసుకుంటున్నారు. కొన్ని రోజులుగా ఈ భూములు తమ పరిధిలోకి వస్తాయని, భూములు వదిలేసి వెళ్లాలని అటవీశాఖాధికారులు రైతులపై వత్తిడి తేవడంతో రైతులు ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సులలో తహసీల్దారుకు అర్జీలు పెట్టుకున్నారు. కొందరు రాష్ట్ర రైతు సంఘ నాయకులకు మొర పెట్టుకున్నారు. గత నెల జనవరి 27న రాష్ట్ర, జిల్లా రైతు సంఘ నాయకులు వచ్చి భూములను పరిశీలించి నిరుపేదలకు ఇచ్చిన భూములు వారికే చెందాలని, వెంటనే జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేసి భూములకు హద్దులు నిర్ణయించి ఎవరి భూములు వారికి కేటాయించాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామంటూ హెచ్చరించారు. వీరిలో 18 మంది రైతులు ప్రజాసమస్యల ప్రజావేదికలో పల్నాడు జిల్లా కలెక్టరును ఆశ్రయించారు. దీంతో కలెక్టరు రెవెన్యూ, అటవీశాఖాధికారులు జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేయాలని, ఇచ్చిన డీకే పట్టాలను పరిశీలించాలని రెవెన్యూ, అటవీ శాఖాధికారులను ఆదేశించారు. జనవరి 29న రెండు శాఖల అధికారులు చెరుకుంపాలెంలోని భూములను పరిశీలించారు. ఆరోజు సర్వే ఒక కొలిక్కిరాకపోవడంతో వాయిదా వేశారు. తిరిగి మంగళవారం సాయంత్రం వరకు శాటిలైట్ ఫోటోలు, ఎఫ్ఎంబీ మ్యాప్‌లు, జీపీఎస్ మెషన్స్ ద్వారా సుదీర్ఘంగా తనిఖీలు చేసి అటవీ, రెవెన్యూ భూములకు వేరువేరుగా హద్దులు నిర్ణయించారు. అయితే రెవెన్యూ భూములను 1993లో తీసుకున్న లబ్ధిదారులందరికీ ఎవరిభూమి ఎంత, ఎక్కడ ఉందనేది, వారికిచ్చిన డీకే పట్టాలద్వారా హద్దులు నిర్ణయించ వలసి ఉంది.

సర్వేకు పెట్టుకుంటే హద్దులు నిర్ణయిస్తాం

దీనిపై డిప్యూటీ తహసీల్దారు జానీభాషా మాట్లాడుతూ రెవెన్యూ, అటవీ శాఖల జాయింట్ ఇన్‌స్పెక్షన్ ద్వారా రెండుశాఖలకు సంబంధించిన భూములకు హద్దులు నిర్ణయించామన్నారు. రెవెన్యూ పరిధిలోని భూములను మాత్రమే లబ్ధిదారులకు ఇచ్చినట్లు గుర్తించామన్నారు. 1993లో డీకే పట్టాలు తీసుకున్న వారిలో 18మంది జిల్లా కలెక్టరుకు అర్జీలు పెట్టుకున్నారని, వీరిలో 16 మందికి సంబంధించి రెవెన్యూ పరిధిలోనే ఉన్నాయని, మరో ఇద్దరు ఫారెస్ట్‌లోకి వెళ్లారని చెప్పారు. 1993లో భూములు తీసుకున్న లబ్ధిదారులంతా రెవెన్యూ సర్వేకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లయితే వారికిచ్చిన డీకే పట్టాల ప్రకారం హద్దులు నిర్ణయిస్తామన్నారు. అప్పుడు తీసుకున్న లబ్ధిదారులలో కొంత మరణించి ఉన్నట్లయితే వారి వారసులకు కేటాయించడం జరుగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్‌శాఖ నుంచి డీఆర్వో కుసుమ కుమారి, ఎఫ్‌బీవో యేసురత్నం, రెవెన్యూశాఖ నుంచి డిప్యూటీ తహశీల్దారు షేక్ జానీ భాషా, సర్వేయరు యు.ఏడుకొండలు, వీఆర్వో శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

కాలువలో జారిపడి వ్యక్తి గల్లంతు



బసప్ప (ఫైల్)

నకరికల్లు: కాలువలో జారిపడిన వ్యక్తి గల్లంతయ్యాడు. ఈ సంఘటన నకరికల్లు పరిధిలోని శ్రీరాంపురం వద్ద గల బెల్లంకొండ బ్రాంచికెనాల్‌లో బుధవారం జరిగింది. సంఘటనకు సంబంధించి ఎస్ఐ చల్లా సురేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన బసప్ప (40) లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తుంటాడు. చెన్నై నుంచి లారీలో వస్తూ బెల్లంకొండ బ్రాంచికెనాల్ వద్ద లారీ ఆపాడు. కాలువలో బట్టలు ఉతుక్కునేందుకు వెళ్లి జారిపడి గల్లంతయ్యాడు. ఆచూకీ కోసం ఫైర్ సిబ్బంది, పోలీసులు గాలింపుచర్యలు చేపట్టినప్పటికీ ఫలితం లేకపోయింది. ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

కాకుమాను: అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల కేంద్రం కాకుమాను శివారులో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. కాకుమాను ఎస్ఐ ఏక్‌నాథ్ కథనం మేరకు... పెదనందిపాడు మండలం గోగులమూడి గ్రామానికి చెందిన చెన్నుపాటి విజయ వెంకట శివప్రసాద్ అనే వ్యక్తి నాలుగేళ్లుగా దుబాయ్‌లో ప్రైవేట్ టీచర్‌గా పని చేస్తున్నాడు. అప్పుడప్పుడు స్వగ్రామమైన గోగులమూడి వచ్చి వెళ్తుంటాడు. మంగళవారం దుబాయ్ నుండి వచ్చాడు. బయటకు వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి కాకుమాను, పుసులూరు గ్రామాల మధ్య పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పుల బాధలే దీనికి కారణంగా తెలిసింది. బుధవారం అతడి భార్య వెంకట సునయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రవ్వవరం తిరునాళ్ల ఏర్పాట్లపై ఎస్పీ పరిశీలన

- శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని సూచన
- ట్రాఫిక్, పటిష్ట బందోబస్తు ఏర్పాటుపై సూచనలు



డ్రోన్ కెమెరాను తీరును పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

నూజెండ్ల (శావల్యాపురం): శాంతియుత వాతావరణలో తిరునాళ్ల వేడుకలు ఘనంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం నూజెండ్ల మండలం రవ్వారం గ్రామంలో వేంచేసియున్న శ్రీకొండ గురునాథ స్వామి తిరునాళ్ల వేడుకలు ఈనెల 12న జరుగుతున్న సందర్భంగా గా భద్రత ఏర్పాట్లును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ కంచి శ్రీనివాసరావు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా డ్రోన్ కెమెరా ద్వారా శాంతి భద్రతలను నిరంతరం పోలీసు శాఖ పర్యవేక్షణ చేస్తుందన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటం చేత పార్టీ జెండాలను రాజకీయ నాయకులు ప్రసంగాలు ప్రభలపై నిషేధమని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయ ప్రాముఖ్యతను అర్చకుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ ఆంక్షలు విధించటంతో పాటు పార్కింగ్ స్థలాలు ఏర్పాట్లు పరిశీలించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే డ్రోన్ కెమెరాతో కొండ పరిసరాలు ప్రాంతాలను తిరునాళ్ల జరుగే ఏరియాను పరిశీలించారు. ఆయనతో పాటు నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు, ఎస్‌బీ సీఐ బండారు సురేష్, వినుకొండ రూరల్ సీఐ ప్రభాకర్‌రావు, ఎస్సైలు యంవీ కృష్ణారావు, లేళ్ళ లోకేశ్వరరావు ఉన్నారు.

నేటి నుంచి విజ్ఞాన్ మహోత్సవ్



సాధన చేస్తున్న విద్యార్థులు

వివిధ రాష్ట్రాల నుంచి 50 వేల మందివిద్యార్థులు రాక

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జాతీయ స్థాయి విజ్ఞాన్ మహోత్సవ్ 18వ ఎడిషన్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయని వైస్ చాన్స్‌లర్ పీ నాగ భూషణ్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని నేటి నుంచి మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని తెలిపారు. ముఖ్య అతిథులుగా ఇండియన్ సింగర్, మ్యూజిక్ కంపోజర్ డాక్టర్ సాలూరి కోటేశ్వరరావు (కోటి), ఇండియన్ మ్యూజిక్ కంపోజర్ అండ్ ప్లేబాక్ సింగర్ ఎస్.ఎస్.తమన్, గౌరవ అతిథిగా ఇండియన్ వాలీబాల్ మాజీ ప్లేయర్ మన్యం తులసి రెడ్డి హాజరవుతారని వెల్లడించారు. రెండో రోజు కార్యక్రమానికి నటుడు విశ్వక్ సేన్, నటి ఆకాంక్ష శర్మ, అభిమన్యు సింగ్ విచ్చేస్తున్నారని పేర్కొన్నారు. చివరి రోజు జరిగే ముగింపు కార్యక్రమానికి దర్శకుడు కేఎస్ రవీంద్ర (బాబీ), 2024 పారా ఒలింపిక్స్ బ్రాంజ్ మెడలిస్ట్ , ఇండియన్ పారా పిస్టల్ షూటర్, అర్జున అవార్డీ రుబినా ఫ్రాన్సిస్ రానున్నారని తెలిపారు. మహోత్సవ్‌లో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచి 50 వేల మంది విద్యార్థులు రానున్నారని వెల్లడించారు. పోటీల విజేతలకు రూ.15 లక్షలకు పైగా బహుమతులను అందజేస్తామని తెలిపారు.

80 ఈవెంట్ల నిర్వహణ

ఈ మహోత్సవ్‌లో మొత్తం 80 ఈవెంట్లను నిర్వహించనున్నారు. స్పోర్ట్స్ ఫీట్‌లో వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, చెస్, అథ్లెటిక్స్, త్రోబాల్, ఫుట్‌బాల్, హాకీ, తైక్వాండో, ఖోఖో, ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్స్, యోగాసన వంటి తదితర క్రీడాంశాల్లో జాతీయస్థాయిలో విద్యార్థులకు పోటీలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. మ్యూజిక్, లిటరరీ, స్పాట్‌లైట్, డాన్స్, డ్రమాటిక్స్ అండ్ ఫిల్మ్ మేకింగ్, ఫ్యాషన్, ఫైన్ ఆర్ట్స్, కల్చరల్స్, థియేటర్ ఆర్ట్స్ వంటి తదితరాలతోపాటు సాంకేతిక, సాంస్కృతికాంశాల్లో జాతీయస్థాయిలో పోటీలు ఉంటాయని వీసీ వివరించారు.

పంచాయతీ సిబ్బందికి శిక్షణ

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్‌లో బుధవారం 'స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 20 ఉత్తమ పంచాయతీల కార్యదర్శులు, క్లాప్‌మిత్రలు, పారిశుద్ధ్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీపీవో బి.వి. నాగసాయికుమార్ ఒక ఈవోపీఆర్డీని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు నిర్వహణ, వర్మీ కంపోస్టుపై మాట్లాడమని సూచించారు. దీంతో దుగ్గిరాల మండలం ఈవోపీఆర్డీ జవహర్‌లాల్ నెహ్రూ ముందుకు వచ్చారు. వివిధ విధుల నిర్వహణలో సెక్రటరీలకు మినహాయింపు ఇచ్చేలా ఎంపీడీవోలకు సూచించాలని కోరారు. డీపీవోగా తనకు కలెక్టర్ వద్ద నాలుగు మీటింగులు ఉంటాయని, అయినా డ్యూటీ వదిలేస్తానా అని నెహ్రూని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో తాను టైం టు టైం చెక్ చేయడం స్టార్ట్ చేస్తే గ్రామంలో పంచాయతీ సెక్రటరీ ఏం చేస్తున్నారో తెలిసిపోతుందన్నారు.

నిందితుడికి రిమాండ్

ఈపూరు (శావల్యాపురం): గత నెలలో కన్నతండ్రినే కాల్వలోకి తోసి చంపిన ఘటనలోని నిందితుడిని నూజెండ్ల మండలం ఉప్పలపాడు గ్రామంలో అరెస్ట్ చేసినట్లు వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకర్‌రావు బుధవారం తెలిపారు. ఈసందర్భంగా సీఐ బి.ప్రభాకర్‌రావు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ బద్రుపాలెం గ్రామస్తులు పిర్యాదు మేరకు నూజెండ్ల గ్రామానికి చెందిన గంగినేని వెంకటేశ్వర్లు అనే నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. 14 రోజుల పాటు న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఆయనతో పాటు ఎస్సై యం. ఉమామహేశ్వరరావు ఉన్నారు.

8 వరకు దరఖాస్తు గడువు పెంపు

నెహ్రూనగర్: గుంటూరు, పల్నాడు జిల్లాలో గీత సామాజిక వర్గాలకు కేటాయించిన మద్యం షాపులకు దరఖాస్తు గడువు ఈ నెల 5వ తేదీ వరకు ఉండగా.. దీనిని 8వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె. శ్రీనివాసులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు జిల్లాకు సంబంధించి స్వీకరించిన దరఖాస్తులలో 10వ తేదీ ఉదయం 9 గంటలకు బ్రాడీపేట 6వ లైనులోని ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయంలో, పల్నాడు జిల్లాకు సంబంధించిన దరఖాస్తులలో పీజీఆర్ఎస్ హాల్, కలెక్టరేట్ కార్యాలయంలో ఆయా జిల్లాల కలెక్టర్ల చేతుల మీదుగా లాటరీ తీయడం జరుగుతుందన్నారు.

8 నుంచి నాటకోత్సవాలు

నగరంపాలెం: ఈ నెల 8, 9వ తేదీల్లో డాక్టర్ కాసరనేని సదాశివరావు కళా సమితి 13వ నాటకోత్సవాలను నిర్వహించనున్నట్లు కళా సమితి చైర్మన్ డాక్టర్ యర్రా నాగేశ్వరరావు, కన్వీనర్ కాట్రగడ్డ రామకృష్ణప్రసాద్ బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. రెండు రోజులపాటు బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థాన ఆవరణలో నాటకోత్సవాలు జరుగుతాయని అన్నారు. 8న సాయంత్రం శ్రీసాయి కార్తీక్ క్రియేషన్స్ (కాకినాడ) ఆధ్వర్యంలో దేవుడు కనిపించాడు అనే నాటిక, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌కు డాక్టర్ కాసరనేని ఆత్మీయ పురస్కారం అందజేస్తామని చెప్పారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తామని అన్నారు. 9వ తేదీన సాయంత్రం హాస్యవల్లరి, సారీ.. రాంగ్ నంబర్, తరమెల్లి పోతున్నదో అనే నాటికలు ప్రదర్శిమవుతాయని తెలిపారు.

ఆరోగ్య సహాయకుల మౌన ధ్యానం

తాడేపల్లి రూరల్: వైద్య ఆరోగ్య శాఖలో ఆరోగ్య సహాయకులను ఉద్యోగం నుంచి తొలగించి రెండు నెలలు దాటినా నేటికీ పునర్నియామకానికి నోచుకోకపోవడంతో బుధవారం మౌన ధ్యానం చేశారు. ఆంధ్రప్రదేశ్ పారా మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీవీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆవరణలో ఎన్టీఆర్ విగ్రహం ముందు దీనిని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 920 మంది ఆరోగ్య సహాయకులు నడిరోడ్డుపై పడ్డారని, అధికార తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి పలుమార్లు వచ్చి పార్టీ పెద్దలకు సమస్యను వివరించామన్నారు. కష్టకాలంలో ఉన్న తమను తక్షణమే ఆదుకోవాలని కోరామని పేర్కొన్నారు. హైకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు మెరిట్ ఆఫ్ ఆర్డర్ చేసి తమకు తిరిగి ఉద్యోగాలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పారా మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎడ్ల బండలాగుడు పోటీలు

న్యూకేటగిరీలో వేటపాలెం ఆర్‌కే బుల్స్‌కు ప్రథమస్థానం



న్యూకేటగిరీలో మొదటిస్థానం సాధించిన వేటపాలెం ఆర్‌కే బుల్స్

నాదెండ్ల: నాదెండ్ల–గణపవరం డొంక రోడ్డులో కొలువైయున్న శ్రీ నందికుంట విఘ్నేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. వీక్షకుల కేరింతలు, ఎడ్ల బల ప్రదర్శనతో దుమ్మురేపాయి. మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం న్యూకేటగిరీ విభాగంలో 13 జతలు పాల్గొన్నాయి. బుధవారం మధ్యాహ్నం నుంచి సబ్ జూనియర్స్ విభాగంలో పోటీలు జరిగాయి. గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి జూనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహించనున్నారు.

న్యూకేటగిరీలో వేటపాలెం జతకు మొదటి బహుమతి

న్యూకేటగిరీలో 13 జతలు పాల్గొన్నాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన ఆర్‌కే బుల్స్ అత్తోట శిరీష్‌చౌదరి, శివకృష్ణచౌదరి ఎడ్ల జత 4750 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాయి. పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన షేక్ అబ్దుల్‌సత్తార్ ఎడ్ల జత 4602 అడుగుల దూరంతో రెండోస్థానంలో నిలిచింది. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం కొప్పురావూరుకు చెందిన టీఎస్ఆర్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ తోట శ్రీనివాసరావు జత 4500 అడుగుల దూరంతో మూడో స్థానంలో, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండల పెదగొట్టిపాడుకు చెందిన జీఎల్ఆర్ బుల్స్ గరికపాటి లక్ష్మీచౌదరి జత 4250 అడుగుల దూరం లాగి నాలుగో స్థానంలో, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పాత మల్లాయపాలెంకు చెందిన సిద్ధంశెట్టి సామ్రాజ్యం జత 4110 అడుగుల దూరం లాగి ఐదో స్థానంలో, తెలంగాణ సూర్యాపేట, హుజూర్‌నగర్‌కు చెందిన జక్కుల సహస్ర యాదవ్, డాక్టర్ హసన్ జత 4003 అడుగుల దూరం లాగి ఆరోస్థానంలో, నాదెండ్లకు చెందిన పాటిబండ్ల రామారావు జత 3750 అడుగుల దూరం లాగి ఏడో స్థానంలో, నరసరావుపేట మండలం దొండపాడుకు చెందిన యర్రం రాజశేఖర్, యశ్వంత్ జత 3393 అడుగుల దూరం లాగి ఎనిమిదో స్థానంలో, కృష్ణాజిల్లా తోట్లవల్లూరు మండలం చిన్నిపుల్లిపాకకు చెందిన ఆర్‌వీఎస్ బుల్స్ జత 3372 అడుగుల దూరం లాగి తొమ్మిదో స్థానంలో నిలిచాయి. విజేతలైన ఎడ్ల జతల యజమానులకు నిర్వాహకులు షీల్డ్, నగదు అందించారు.

మార్కెట్‌లోకి సుజుకి ఎస్సెస్ 125 సీసీ స్కూటర్

నగరంపాలెం: స్థానిక ఆటోనగర్ సరిపూడి సుజుకి బ్రాంచిలో బుధవారం సుజుకి ఎస్సెస్ 125 సీసీ స్కూటర్‌ను మార్కెట్‌లోకి విడుదల చేశారు. సరిపూడి సుజుకి సంస్థ అధినేత సరిపూడి అనిల్‌కుమార్, ఎస్ఎంఐపీఎల్ ఆర్ఎం శివరామకృష్ణ, ఏఆర్ఎం బాలకృష్ణ, సీఈఓ శ్రీనివాసరావు దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టూ వీలర్ విక్రయ రంగంలో సుజుకికి ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్నాయని అన్నారు. సుజుకి ఎస్సెస్ 125 సీసీ స్కూటర్‌ను ప్రారంభించడం అభినందనీయమని చెప్పారు. అన్నివర్గాలతోపాటు యువతకు ఆకర్షణీయంగా ఉంటుందని అన్నారు. సంస్థ అధినేత సరిపూడి అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఈ స్కూటర్ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారైందని అన్నారు.

ప్రజలను మభ్య పెట్టిన కేంద్ర బడ్జెట్

డాక్టర్ యలమంచలి శివాజీ

లక్ష్మీపురం: కేంద్రం ప్రవేశ పెట్టిన 2025–26 బడ్జెట్ మాటల గారడీగానే కొనసాగిందని, ప్రజలను మభ్యపెట్టేలా ఉందని రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచలి శివాజీ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం బడ్జెట్‌పై విశ్లేషణలో ఆయన మాట్లాడుతూ... అన్ని బడ్జెట్‌లలోనూ పేదలను కేంద్ర ఆర్థిక మంత్రి విస్మరించారన్నారు. చెప్పిన దానికి, వాస్తవ కేటాయింపులకు పొంతన ఉండటం లేదని తెలిపారు. గ్రోత్ రేట్ పెరిగి పోతుందనేది అబద్ధమన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెరగకుండా విదేశాల బడ్జెట్ లెక్కలతో పోల్చి చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆర్థిక సరళీకరణ పేరు కాపాడే బడ్జెట్‌లా ఉందని, ప్రజా ప్రయోజనాల బడ్జెట్‌గా లేదన్నారు. ఆర్థికవేత్త డాక్టర్ అబ్బరాజు శేఖర్ మాట్లాడుతూ.. వికసిత భారత్ వృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్ పరిణామం, కేటాయింపులు లేవన్నారు. మధ్యతరగతికి అనుకూలంగా ఇన్‌కంటాక్స్ స్లాబ్‌లు మార్చడం హర్షణీయమని పేర్కొన్నారు. వ్యవసాయ అభివృద్ధి, రైతుల సంక్షేమానికి కేటాయింపులు తగ్గించడం శోచనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, ఆర్థికవేత్త డాక్టర్ జి.సధాకర్, జొన్నలగడ్డ రామారావు పాల్గొన్నారు.